# చట్టాలున్నాయ్..! కానీ...?!

"ప్రతి ఉదయం తప్పకుండా వాక్ వెళ్ళమంటున్నాడు డాక్టర్ వేదవ్యాస్ నన్ను!" అన్నాడు తంగప్ప ఆదివారం సాయంకాలం వాక్ వెళ్తున్నప్పుడు.

"మరయితే... రేపట్నుండి ఉదయం కూడా వాక్ వస్తే సరి!" అన్నాడు చంగప్ప ఉత్సాహంగా.

"మరీ ఇంతదూరం ఉదయం పూట వస్తే నాకు పూజకూ దానికీ ఆలస్యం అయిపోతుంది కానీ... అంకిపాడు మిట్టకేసి వెళ్ళొద్దాం కాస్త పెందలాడే!" అన్నాడు తంగప్ప.

"నీ ఇష్టం తంగప్పా! నీవెలా సెలవిస్తే అలాగే!" అన్నాడు చంగప్ప నవ్వేసి.

"సరే రేపు ఉదయం ఐదున్నరకు మీ ఇంటికి వచ్చేస్తాను. అలా అంకిపాడు మిట్టకేసి వెళ్ళొద్దాం!"

"అలాగే! అలాగే!!"

★ ★ ★

ఉదయం అయిదూ ఇరవై అయిదుకే కాలింగ్ బెల్ మ్రోగింది.

అప్పుడే ఎక్సర్‌సైజులు ముగించుకున్న చంగప్ప వెళ్ళి తలుపు తీసాడు.

"సిద్ధంగానే ఉన్నావు కదా? పదపద... కదిలి... బయల్దేరు!" అన్నాడు తంగప్ప తలుపవతలనుంచే...

"లేడికి లేచిందే పరుగన్నట్లు జోరుగా ఉన్నావే! లోపలికి రా... కాస్త టీ త్రాగి వెళ్దాము!"

"నేనిందాకే కాఫీ త్రాగి వచ్చా... టీ వద్దు!"

"కాఫీ త్రాగాక మళ్ళీ టీ త్రాగినంత మాత్రాన కాక్‌టైల్ అయిపోదు కానీ నీవు ముందు లోనికిరా!" అన్నాడు చంగప్ప.

"లోపలికి వస్తా కానీ... టీ వద్దు!" అన్నాడు తంగప్ప లోపలికి అడుగులేస్తూ.

"ఎందుకబ్బా?"

"నిన్న ఆదివారం కదా?" అంటూ సణిగాడు తంగప్ప.

"నిన్న ఆదివారం అయితే ఈరోజు టీ త్రాగరాదని ఏ శాస్త్రమైనా చెపుతోందా?" ఆశ్చర్యంగా అడిగాడు చంగప్ప.

"నిన్న మాంసం అదీ ఎక్కువగా వండి ఉంటారు కదా మీ ఇంట్లో?!" అన్నాడు సంశయంగా తంగప్ప సోఫాలో కూర్చుని.

"ఓరి నీ చాదస్తం మండిపోనూ... అరవై దాటితే అరులూ మరులూ అన్నారు... నీలాంటి వారిని చూసేనేమో?" అన్నాడు చంగప్ప ఉడుక్కుంటూ.

"ఈయన రిటైర్ అయి మిలటరీ నుంచి వచ్చిన నాటి నుంచీ మా ఇంట మాంసం వండని రోజే లేదన్నా! ఎంత మాంసాహారులమైనా టీ కెటిల్‌లో, కప్పులలో కూడా వేసుకుని తిం

టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి

టామా ఏమిటి?" అంటూ పొగలు గక్కుతున్న టీ కప్పులున్న ట్రే పట్టుకు వచ్చింది మహా లక్ష్మమ్మ.

అయిష్టంగానే నోటి దగ్గరుంచుకున్నా, టీ మహా రుచికరంగా ఉండడం వల్ల కిక్కురుమన కుండా త్రాగేసాడు తంగప్ప.

తరువాత ఇద్దరూ కలిసి అంకిపాడు మిట్ట కేసి బయల్దేరారు.

దారిలో ఒకచోట...

మెయిన్ రోడ్డు ప్రక్కగానే ఉన్న చిన్న మురికివాడ ముంగిట కన్పించిన దృశ్యం వారి నడకను ఆపింది.

తల చెదిరి, ముఖం, కళ్ళు కాస్త ఉబ్బినట్లున్న ఓ పొడవాటి వ్యక్తి ఓ రేకు ఊదర బర్రతో ఓ చిన్న కుర్రవాడ్ని గొడ్డును బాదినట్లు బాదేస్తున్నాడు. చుట్టూ కొంతమంది నిలబడి చోద్యం చూస్తున్నారు తప్ప అడ్డుపడడం లేదు.

కుర్రవాడి ఏడుపూ, అరుపులూ హృదయ విదారకంగా ఉన్నాయి.

చంగప్ప ఆ దారుణాన్ని చూస్తూ సహించలేక రోడ్డు దిగి ఆ గుంపుకేసి దూసుకుపోయాడు. అయితే చోద్యం చూస్తున్నవారు అతన్ని ఆపేసారు... "వాడు తాగుబోతు వాడు... మీరెందుకు వెళ్ళడం?" అంటూ.

అయినా చంగప్ప ఆగలేదు... వెళ్ళి తల చెదిరిన వాడి చేతిలోని ఊదరగొట్టాన్ని పట్టి లాగేసాడు.

"పైపెందుకు తీసుకున్నావు?" అసలే ఎర్రని కళ్ళు మరింత ఎర్రబారగా ప్రశ్నించాడతను.

"కుర్రాడ్నెందుకలా చితక బాదుతున్నావ్?"

"నా కొడుకు... నాయిష్టం!"

"నీ కొడుకైనంత మాత్రాన ఇలా క్రైమా కొట్టవచ్చా!"

"నా యిష్టం అన్నాను కద?"

"నీ యిష్టం నీ ఇంటి నాలుగ్గోడల మధ్యన. ఇక్కడ కాదు!"

"అది చెప్పడానికి నీవెవరు?"

"నేనా? రిటైర్డ్ మేజర్ చంగప్ప నాయుడినే నీవెవరని అడుగుతావా? ఈ ఘటోద్గజపురంలో నన్నిలా ప్రశ్నించిన వారేలేరు! నీకెంత ధైర్యం?" గద్దించాడు చంగప్ప.

ఉబ్బుకళ్ళవాడు కాస్త తగ్గాడు... కానీ అతని ప్రక్కనే వున్న ఓ స్త్రీ రెచ్చిపోయింది.

"వీడ్ని కొడ్తే ఏం... కోసి బండకేస్తే ఏం?" అంటూ తన చేతుల్లోని ప్లాస్టిక్ బిందెతో బాదడం మొదలుపెట్టింది. వాడు ఏడుస్తూ, కేకలు పెడ్తూ నేలమీద పడి దొర్లడం మొదలుపెట్టాడు మళ్ళీ.

"అయ్యో! అయ్యో!! ఆడకూతురయుండీ అలా కొట్టవచ్చా?" అన్నాడు చంగప్ప బిందెను లాక్కోవడానికి ముందుకెళ్ళి.

"అడ్డొస్తే నిన్నూ కొడ్తా!" అందామె ఉగ్రంగా.

"ఎందుక్కొడ్తావ్? అసలు నువ్వెవరు??"

"నేనా? నీయమ్మ మొగుడ్ని... పో పోవయ్యా!"

"అంత మాటంటావా? ఆడదానివి కాకపోయుంటే ఏటుకు కాల్చి పారేద్దును!" అన్నాడు చంగప్ప కోపంగా.

"పెద్ద మొనగాడొచ్చాడమ్మా... కాలుస్తాడంట... కాలుస్తాడు... పోపో... ఆడబోయి పందుల్ని కాల్చుకోపో!" అందామె పిల్లవాడ్ని వదిలి


పెట్టి ఉగ్రంగా చంగప్ప మీదికొస్తూ.

అంతదాకా చోద్యం చూస్తున్న వాళ్ళు చంగప్పను కొంత దూరం లాక్కుపోయారు.

"మీకెందుకు మీరు వెళ్ళండి సార్! ఆ అంకమ్మ నోరు చాలా చెడ్డది!"

"ఎవరయ్యా ఈ అంకాలమ్మ?" అన్నాడు చంగప్ప దస్సిపోయి.

"ఆ పిల్లోడి అమ్మకదా!" అన్నాడు ఒకతను.



"ఈ నరాల నారిగాడి ఫెండ్లామే కదా!" అన్నాడు మరొకతను.

"తల్లయివుండీ ఆ కుఱ్ఱాడ్ని ఎందుకలా బాదడం?"

"వాడు హోటల్లో పనిచేస్తాడు కదా!"

"ఇంత చిన్నోడా?"

"ఇంకా చిన్నోళ్లు కూడా చేస్తారు!"

"ఏం పని?" ఆశ్చర్యపోతూ ప్రశ్నించాడు చంగప్ప.

"ప్లేట్లూ, గ్లాసులూ, పాత్రలూ కడగడం!"

"మరి పనిచేసేవాడినెందుకూ బాదడం?"

"రెండ్రోజులుగా వీడు పని ఎగ్గొట్టి పిల్లోళ్ల జతల్తో గోలీలాడుకోవడానికి వెళ్ళిపోతున్నా డట!"

"పోతే?!"

"పోతే ఏముంది? హోటలాడు ఇచ్చే లెక్క రాదు... వీడు తెచ్చే మిగులు తిండీ ఇంటికి రాకుండా పోయె!"

ఈలోగా ఉబ్బు మొహంవాడు కుఱ్ఱాడ్ని కొట్టడం, కాలితో తన్నడం మొదలుపెట్టాడు మళ్ళీ.

చంగప్పకు మండిపోయింది.

"రేయ్... ఎవడ్రా నీవు?... కుఱ్ఱాడ్ని చం పేస్తున్నావు... నీమీద కేసు పెడ్తా!" అంటూ అరిచాడు చంగప్ప చట్టాలు, సెక్షన్లూ ఏకరువు పెడ్తూ.

దాంతో అతడు కొట్టడం ఆపాడు కానీ... "ఏం కేసు పెడ్తావురా నాపోటు మొగోడా?" అంటూ బూతులు మొదలుపెట్టింది అంకమ్మ.

"తంగప్పా... ఈరోజు మార్నింగ్ వాక్ వద్దు. పోలీసు స్టేషనుకు వెళ్ళి వీళ్ళ సంగతి చూడాలి!" అంటూ ఆవేశంగా బయల్దేరాడు చంగప్ప.

"దారి వెంట వెళ్ళే గంగమ్మా, నా ఇంటి దాకా రా! అన్నట్లుగా ఇదంతా మనకెందుకు?" అన్నాడు తంగప్ప విసుగ్గా.

కానీ చంగప్ప త్రీటవున్ పోలీసు స్టేషనుకు వెళ్ళే దాకా ఆగలేదు.

మద్రాసు రోడ్‌లో కాలరెడ్డి బ్రిడ్జి ప్రక్కన మురికి వాడలో నరాల నారప్ప, అతని భార్య అంకమ్మ తమ కొడుకును బాల కార్మికునిగా మార్చేస్తున్నారని కూలి పనికి వెళ్ళనందుకు పాశవికంగా గొడ్డును బాదినట్లు బాది హింసిస్తు న్నారనీ ఫిర్యాదు చేశాడు.


"సార్! ఇదే విషయం మీరు రైటింగ్‌లో ఇవ్వాలి!" అన్నాడు హెడ్ కానిస్టేబులు. అంత పెద్ద స్టేషన్‌లో తెల్ల కాగితాలు లేవు.

దగ్గరి దాపులలోని దుకాణాలలో తెల్ల కాగి తం దొరకలేదు. బజారుకేసి వెళ్ళి, కాగితం తీసు కువచ్చి కంప్లైయింటు వ్రాసి ఇవ్వాల్సి వచ్చింది. తంగప్ప కూడా సాక్షి సంతకం చెయ్యక తప్ప లేదు.

"కాస్సేపు కూర్చోండి సార్! ఎస్.ఐ.గారు రావాలి!" అన్నాడు ఎ.ఎస్.ఐ.

ఎనిమిది గంటలు దాటాక స్టేషనుకు వచ్చి న ఎస్.ఐ. చంగప్పకు తెలిసినవాడే!

"అలాగే సార్... బాలకార్మిక చట్టం క్రిందా, పబ్లిక్ న్యూసెన్సు క్రిందా కూడా కేసు బుక్ చే ద్దాం!" అంటూ ఓ కానిస్టేబుల్ని కాఫీ తెప్పించ డానికి మరో కానిస్టేబుల్ని అంకమ్మకి, నరాల నారప్పనూ పిల్లోడితో సహా పట్టుకురావడానికి పంపించాడు.




కాఫీ రావడానికి అరగంట పట్టింది. కాఫీ త్రాగుతూండగా పోలీసువెంట స్టేషనుకు వచ్చారు నారప్ప, అంకమ్మలు కుర్రాడితో సహా. వాళ్ళను చూడగానే కాఫీ పొలమారింది చంగప్పకు. తంగప్ప కూడా నోరు తెరిచేసాడు.

అంకమ్మ వాయిల్ చీర కట్టింది. తల దువ్వింది. పూలు పెట్టింది... అణుకవయిన పెద్ద ముత్తయిదువులా నెమ్మదిగా నడచి వచ్చింది. నారప్ప కూడా శుభ్రంగా తల దువ్వుకుని, తన తాగుబోతు ముఖానికి పౌడరు కూడా వేసుకుని, [illegible] పంచ, తెల్ల చొక్కా ధరించి వచ్చాడు. కుర్రవా[illegible] ఒంటి మీద కూడా ఇస్త్రీ చేసిన చొక్కా, నిక్కర్లున్నాయి.

'రామరామా! మా పిల్లోడు బడికిబోయే పిల్లోడు సార్! బడికి బోకుండా గోలీలాటకు బోతున్నాడని కొట్టింది నిజమే సార్!" అన్నాడు నారప్ప వినయంగా.

"ఏం అంకమ్మా నీకు నోరు చాలా ఎక్కువట. సూదీ దారంతో కుట్టించేస్తాను" అన్నాడు ఎస్.ఐ.

అంకమ్మ వంచిన తల పైకెత్తలేదు... కానీ...

"అది నోరెత్తే రకం కాదు సార్... నిజం!" అన్నాడు నారప్ప వకాల్తా పుచ్చుకుని.

"సరి సరిలే..." అంటూ కుర్రాడివైపు తిరిగి... "ఏరా, ఎందుకు కొట్టారు నిన్ను?" అని ప్రశ్నించాడు.

"నేను బడికి బోలేదు సార్! అందుకు కొట్టారు!" అన్నాడు వాడు.

"సరే వెళ్ళు... ఎక్కడైనా గోలీలాడుతూ కన్పించావా? బొక్కలో దోసి బోడి కొట్టిస్తాను! ఆ!!" అన్నాడు ఎస్.ఐ..

వినయంగా ఎస్సైకి దండాలు పెట్టి కుర్రాడ్ని తీసుకుని వెళ్ళిపోయారు నారప్ప, అంకమ్మలు.

"ఐయాం సారీ సర్... మీరు కంప్లెయింటు వాపసు తీసుకుంటే మంచిది!" అన్నాడు ఎస్.ఐ.

చంగప్ప మౌనం వహించాడు... యుద్ధరంగంలో అరివీర భయంకరంగా, వీరోచితంగా పోరాడుతున్నప్పుడు శత్రువు హఠాత్తుగా తెల్ల జెండా ఎత్తేస్తే కలిగే అనుభూతిలో పడిపోయి. సివిల్ వార్స్‌లో పౌరుషం ఉండకపోవడం కూడా సహజమేనని అతనికి సరిగ్గా తెలియదు!!

"మనం కేసు పెట్టి... రేపు కుర్రాడిలా కోర్టులో సాక్ష్యం చెప్పివుంటే... పరువుపోయేది!" అన్నాడు ఎస్.ఐ. మళ్ళీ తనే.

"ఎవరి పరువు?" అని ప్రశ్నించబోయి మానుకున్నాడు చంగప్ప.

కానీ తంగప్ప ఊరుకోలేకపోయాడు... "ఒక పనిచేసి ఉంటే చాలా బావుండేది!" అన్నాడు లేచి బయల్దేరబోతూ.

"ఏమిటి?" అన్నాడు ఎస్.ఐ.

"కుర్రాడి వంటి మీద తేలిన వాతలను పరిశీలించి ఉండాల్సింది. కనీసం కుర్రాడ్ని ఏం చదువుతున్నావు? ఏ స్కూల్లో? అనయినా ప్రశ్నించి ఉండాల్సింది!" అన్నాడు.

ఎస్సయి వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. కానీ నిమిషం తరువాత...

"వన్స్ అగైన్ సారీ సర్... చట్టాలున్నాయ్... కానీ..." అంటూ అర్ధోక్తిలో ఆపేసాడు.

"ఇట్సాల్ రైట్... మంచి కాఫీ త్రాగించారు... థాంక్యూ వెరీమచ్!" అంటూ బయల్దేరారు చంగప్ప, తంగప్పలు కలిసి. ఇద్దరూ స్టేషను లోంచి వెలుపలికి వచ్చి రోడ్డు మీద నడుస్తుండగా అన్నాడు తంగప్ప..." నాకు ఈ ప్రభుత్వ కార్యాలయాలంటే అందుకే అయిష్టం... వాటిలో ఏ పనీ సక్రమంగా జరగదు మరి!"

చంగప్ప జవాబు చెప్పలేదు.

"మా ఇంటికి వెళ్ళి టిఫిన్ తీసుకుందాం!" అన్నాడు తంగప్ప.

"నా మనసేం బాగులేదోయ్! ఆకలికావడం లేదు!!"

"ఓ పని చేద్దాం... శివాలయం దగ్గరేగా... వెళ్ళి వద్దాం. మన మనసులు కాస్త సర్దుకుంటాయి. ఆలోపు నీకు ఆకలవుతుంది. ఇద్దరం కలిసే టిఫిన్ తీసుకోవాలి ఈరోజు!"

"మనమింకా స్నానాలు చేయలేదు కద?" సంశయంగా అన్నాడు చంగప్ప.


"మనసులు శుచిగా వుంటే చాలు... పద!" అన్నాడు తంగప్ప శివాలయం వీధిలోకి తిరుగుతూ.

ఎప్పుడూ పరమ ప్రశాంతంగా వుండే శివాలయం ఆరోజు చాలా గొప్ప సందడిగా వుంది... అయ్యప్ప భక్తులు చాలామంది ఇరుముడులు కట్టి ప్రయాణాలకు సన్నద్ధం అవుతుండడం వల్ల!

కొంతమంది స్త్రీపురుష భక్తాదులు "స్వామియే! అయ్యప్పో!! అయ్యప్పో! స్వామియే!!" అని ముక్తకంఠాలతో, పెద్ద స్వరాలతో భజనలు కావిస్తున్నారు.

ఆలయ ప్రదక్షిణ కావిస్తున్నప్పుడు అన్నాడు చంగప్ప... "ఇలా అందరూ దేవాలయం కప్పెగిరి పోయేలా అరుస్తూ భజనలు చెయ్యడం వల్ల పెద్దెత్తున శబ్దకాలుష్యం ఉత్పన్నమవుతుంది కదా!"

"ఉష్! అలా మాట్లాడకు... అయ్యప్ప భక్తులు వింటే నొచ్చుకుంటారు! కోప్పడవచ్చు కూ




డా!!" అన్నాడు తంగప్ప.

"కోపాన్ని జయించడానికి, ఆవేశకావేశాల్ని అదుపులో ఉంచుకోవడానికే కదా ఈ మాలధారణలు..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయి మానుకున్నాడు చంగప్ప. అతనికి విసుగ్గా కూడా అన్పించింది.

కానీ గుడిలో... ఓ ఏడెనిమిదేళ్ళ పాపకు ఇరుముడి ధారణ గావింపబడ్తుండడం చూసాక మౌనంగా ఉండలేకపోయాడు...

"తంగప్పా! మరీ ఇంత చిన్న బిడ్డకు మాల ధారణ గావించడం... ఇన్ని రోజులు పెందలాడే నిద్రలేపి చన్నీటి స్నానాలు చేయించడం, భజనలు చేయించడం... ఇదంతా అవసరం అంటావా?"

"ఎవరి విశ్వాసాలు వారివి కద చంగప్పా?!"

"నేను విశ్వాసాలను వ్యతిరేకించడం లేదు. కానీ ఇప్పుడు చూడు. ఈ ఇరుముడేదో కట్టించి ఈ లేత పాపను అంత పెద్ద యాత్ర చేయించడం, కాలి నడకన అంత పెద్ద కొండ ఎక్కించడం... ఇదంతా నామటుకు నాకు బాల కార్మికులు పడే శ్రమకన్నా ఎక్కువ శ్రమతో కూడుకున్న పనిగా తోస్తోంది!" అన్నాడు చంగప్ప బాధగా.

"మిలటరీలో పనిచేసిన వారివి కరకు గుండెలనుకుంటారు... కానీ వాళ్ళకే దయ, కరుణ, ఆలోచనలు అధికం" అనుకున్నాడు తంగప్ప మనసులో.

కానీ పైకి మాత్రం... "ఉష్!" అన్నాడు.

"నా ప్రాణానికి నీవొకడవు... ప్రతి దానికీ ఉష్! బుష్!! అంటూ... అవునూ... అన్నట్లు ఈ చిన్న పిల్లల మాలధారణలను ప్రతిఘటించేందుకు, ఆపేందుకూ చట్టమేదీ లేదా?"

"చంగప్పా... చట్టాలున్నాయ్... కానీ... ?!..." అంటూ అర్థోక్తిలో ఆపి, నిండుగా నవ్వాడు తంగప్ప. ●